సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 25 । నవంబర్ । 2024



పుంజుకొన్న టమాటా
జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.36 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. -8లో



రసవత్తరంగా నెట్‌బాల్ పోటీలు
రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. విశాఖపట్నం, తూర్పుగోదావరి, వైఎస్సార్, చిత్తూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.420
రెండోరకం	రూ.250	రూ.340

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 258 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 25వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

దేవనాగరి హిందీ సేవి సమ్మాన్ పురస్కారానికి ఎంపిక



సర్తాజ్ హుస్సేన్

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ దేవనాగరి హిందీ సేవి సమ్మాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈవిషయాన్ని ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులకు తెలిపారు. రాష్ట్రభాష సేవా సంఘ్ ఫౌండేషన్ ప్రతి ఏడాది దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జాతీయ భాష అయిన హిందీ అభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులకు ఈపురస్కారం అందచేస్తుందన్నారు. అందులో భాగంగా ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోబోతున్నట్లు తెలిపారు. సర్తాజ్ హుస్సేన్ పుల్లంపేట మండలం టీ.కమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

యువజనోత్సవాల్లో పాల్గొనాలి
రాయచోటి: జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సెట్ప్ సీఈఓ సాయి గ్రేస్, నెహ్రూ యువజన కేంద్ర జిల్లా యువ అధికారి కె మణికంఠ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల సంయుక్త ఆధ్వర్యంలో రాయచోటిలోని భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల చివరి వారంలో జరుగుతాయన్నారు. యువజనోత్సవాలలో ఇండియా 2047 అనే అంశంపై పెయింటింగ్, వ్యాసరచన, మొబైల్ ఫోటో గ్రఫీ, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు సెట్ప్ మేనేజర్ 9949298810, 8008819556 మొబైల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అలుమ్నీ సభ్యుడు

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం సీటీఓ బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 76వ ఎన్‌సీసీ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతాపంకజ్ ఎన్‌సీసీ కేడెట్ల క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను వివరించారు. ఉప ప్రిన్సిపల్ ఎం.మునియానాయక్ ఎన్‌సీసీ చరిత్ర, దాని అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ మునుపటి విద్యార్థుల(అలుమ్నీ) సమావేశాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అలుమ్నీ సభ్యులు తమ అనుభవాలను వివరించారు.

1న ఘనంగా లక్షార్చన మహోత్సవం
ప్రొద్దుటూరు కల్చరల్: పెన్నానది తీరంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో డిసెంబర్ 1న ఘనంగా లక్షార్చన మహోత్సవం నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఆదివారం లక్షార్చనకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో 30 ఏళ్లుగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. లక్షార్చన రోజు స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 30వేల మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేస్తున్నామన్నారు. డిసెంబర్ 12న అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, స్వామి అయ్యప్ప సేవా సంఘం గౌరవాధ్యక్షుడు నామా రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు రామ్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

తెగిన పోగులు.. మారని బతుకులు

ఒంట్లో నరాలను దారాలుగా పోగుచేసి కష్టపడుతున్నా.. రక్తంతో రంగులు అద్ది చెమటోడుస్తున్న చేనేతల బతుకు చిత్రం మారడం లేదు. వారి కష్టాలు తెలిసి సంక్షేమానికి ఊతమివ్వాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో చేనేతల బతుకు చిద్రంగా మారింది.

- రాష్ట్ర బడ్జెట్‌లో నేతన్నలకు రిక్తహస్తం
- హామీలు విస్మరించిన కూటమి నేతలు




చరకా చుడుతున్న నేత కార్మికురాలు

మదనపల్లి: 'మేం అధికారంలోకి వస్తే నేతన్నలకు అండగా నిలుస్తాం. చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. ఆరోగ్య బీమా పెంచుతాం. సబ్సిడీ నూలు,మార్కెట్ అవకాశాలు పుష్కలంగా కల్పిస్తాం. వస్త్ర కొనుగోలుపై 20 శాతం రిబెట్ ఉండేలా చర్యలు చేపడతాం..' అంటూ గత ఎన్నికల ప్రచారంలో విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా చంద్రబాబునాయుడు హామీలు గుప్పించారు. కల్లబొల్లి మాటలతో నేతన్నలను బోల్తా కొట్టించి ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా వారి హామీల అమలుకు కనీసం బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేయకుండా నరకం చూపిస్తున్నారు. నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక... చేనేత వస్త్రాలకు మార్కెట్లో డిమాండ్ లేక పలువురు అర్థాకలితో అలమటిస్తున్నారు. మరికొందరు మగ్గాలు వదిలి వలసబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

- చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ కూటమి నేతలు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వారికిచ్చిన హామీల మేరకు కనీసం నామమాత్రంగానైనా కేటాయింపులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు కాగా అందులో చేనేతరంగానికి కేటాయింపులు తగ్గించడంపై పలువురు రగలిపోతున్నారు.

గతంలో అండగా నేతన్న నేస్తం
మోడుబారిన మగ్గం బతుకులకు గత ప్రభుత్వం సంక్షేమ రంగులు అద్దింది. నేత పనులు సాఫీగా సాగే విధంగా మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి పురుడు పోశారు. ఈ పథకం కింద అర్హత కలిగిన చేనేత కుటుంబానికి నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తూ వచ్చారు. ఐదు విడతల్లో ఒక్కో నేత కార్మికుడికి రూ.1.2 లక్షలు అందించారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు క్లస్టర్లు ఏర్పాటు చేసి పరికరాలు అందించారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కార్మికులకు సరైన ప్రోత్సాహం, ఉపాధి ఇవ్వకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితి దాపురించింది.



గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు (రూ.లక్షల్లో)
2021-22	5837	14,00,88,000
2022 -23	6118	14,68,32,000
2023-24	6937	16,64,88,000

ప్రత్యేక బడ్జెట్ విడుదల చేయాలి



చేనేతలకు అన్నీ విధాలుగా ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలి. నేత కార్మికుల కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తో పాటు ప్రత్యేక యూనిట్స్‌ను మంజూరు చేసి అండగా నిలవాలి.

-జి.సుధాకర్, చేనేత జన సమాఖ్య అధ్యక్షులు,మదనపల్లె

జీఎస్టీని మినహాయించాలి



చేనేత కార్మికులు చీర తయారీకి సంబంధించిన ముడిసరుకులు కొనుగోలు, క్రయవిక్రయాలపై గతంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీని మినహాయించాలి. చేనేత వ్యాపారులు మరింత ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి.

-దండు రామాంజులు,చేనేత కార్మిక సంఘ నాయకులు

మూగబోతున్న మగ్గాలు



జిల్లాలో మదనపల్లె(నీరుగట్టువారిపల్లె), నిమ్మనపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పుల్లంపేట, చిన్నమండ్యం,రాజంపేట, వీరబల్లి ,కలకడ, తంబళ్లపల్లె, కురబలకోట తదితర ప్రాంతాల్లో పలువురు చేనేత మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేనేతను పూర్తిగా విస్మరించడంతో పలువురు నేతన్నలు మగ్గాలు వదిలి ఇతర కూలిపనుల్లో నిమగ్నమవుతున్నారు. మరికొందరు కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలో మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో 25వేలకు పైగా ఉన్న మగ్గాలు ప్రస్తుతం 15 వేలకు తగ్గిపోయాయి. కొందరు కులవృత్తిని వదులుకోలేక పట్టుచీరలను నేస్తున్నారు. వాటికి మార్కెట్‌లో డిమాండ్ లేక కుమిలిపోతున్నారు.చేనేతరంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికిపైగా జీవనోపాధి పొందేవారు. నేడు చాలా మంది ఉపాధి కోల్పోయారు.

డిసెంబర్ 4న పాటల పోటీలు
రాయచోటి అర్బన్: ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని షిర్డీ సాయినాథుడి మందిరంలో డిసెంబర్ 4న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ లక్ష్మివెంకటేశ్వర కళామండలి అధ్యక్షుడు ఎస్.వి.భాస్కరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల వారు రూ. 100 చెల్లించి పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ రమణ

రాయచోటి టౌన్: గిరిజన ఉద్యోగల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పీవీ రమణ అన్నారు. ఆదివారం రాయచోటిలోని ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన భవనం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్మించాలని కోరారు. అలాగే రిజర్వేషన్‌లలో పక్కాగా అమలు పరచాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పి. గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు: జిల్లా గిరిజన ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ సలహాదారుడిగా దాడి కృష్ణా నాయక్, అధ్యక్షుడిగా పి. గోపాల్, ఉపాధ్యక్షులుగా దొరస్వామి నాయక్, నాగేశ్వరరావు, దేవరకొండ మోహన్, కె. మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎం. బలరాంనాయక్‌లను ఎన్నుకున్నారు.

హృదయాలను కలిపే జాతీయభాష ఉర్దూ

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- అలరించిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం



జ్యోతిప్రజ్వలన చేసి కవిసమ్మేళనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె సిటీ: హృదయాలను కలిపే జాతీయ భాష ఉర్దూ అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక బెంగళూరు బస్టాండు వద్దనున్న బడేమకాన్‌లోని హజరత్ ఖాదర్‌షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉర్దూ భాష మాధుర్యాన్ని వివరించారు. ఎందరో ముస్లిమేతరులు ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఉర్దూభాషలో నిర్వహించే ముషాయిరాలు (కవి సమ్మేళనాలు) జాతీయ సమైకత్యకు దోహదపడతాయన్నారు. ఇందులో భక్తితో కూడిన కవితలతో పాటు సమాజాన్ని మేల్కొలిపే కవితలు, గజల్స్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటాయన్నారు.అనంతరం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఉర్దూ కవులు తమ కవిత్వంతో అందరినీ అలరించారు. మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితంపై నాత్ కవితా గానం చేశారు. కవులు,ఉర్దూ అకాడమీ నుంచి పురస్కారాలు అందుకున్న మహమ్మద్ షాహిద్, డాక్టర్ మహమ్మద్ నకీఉల్లాఖాన్, ఇమాం ఖాసిం, కె.సి.కరీముల్లాఖాన్, జాఫరుద్దీన్‌లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు.

- కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, దర్గా ముతవల్లి హాషిం, కవి సమ్మేళనం కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కార్యదర్శి ఖమర్‌అమీని, మదీనా విశ్వవిద్యాలయ అచార్యులు ఇనాయత్‌అమీన్, రూటా నాయకులు ఇస్మాయిల్, సిబాత్ ఉరద్‌రహ్మాన్, నాదిర్‌షావల్లి, షరాఫత్‌అలీఖాన్, పలువురు కవులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకావాలి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మన్నూరు జిల్లాపరిషత్ హైస్కూల్ పోలింగ్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేట: జనవరి1, 2025నాటికి 18 సంవత్సరాలు పూర్తి కానున్న విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. ఆదివారం రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియను కలెక్టరు పరిశీలించారు. కాగా పట్టణంలోని టీడీపీనేతకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్‌లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమ సభలో కెలెక్టరు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ఓటు వేసే హక్కు ఉపయోగించుకోనప్పుడు ప్రశ్నించే హక్కు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు, కమిషనరు, మన్నూరు సీఐ ఎస్ఎం అలీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్ పరిశీలన
ఓబులవారిపల్లె: కొత్త ఓట్ల నమోదులో బీఎల్ఓల ప్రాత్ర కీలకమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం చిన్నఓరంపాడు పంచాయతీలోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు.అనంతరం 133, 134 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, వీఆర్ఓ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో 183వ పోలింగ్ బూత్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో బీఎల్ఓ అనిల్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ అరవింద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'మ్యాథ్ 'బి'కి చక్కటి స్పందన



మ్యాథ్ 'బి'లో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ: లెక్కలంటే అన్నీ చిక్కులే.. కొందరికిదో బ్రహ్మపదార్థం. అర్థం చేసుకున్న వారికి మాత్రం ఆసక్తికరం. చిన్నవయసులో నేర్చుకునే చిట్కాలు జీవితాంతం గుర్తుండిపోతాయనేది నిపుణుల మాట. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. వారిలో గణితంపై ఆసక్తి పెంచేలా.. చిన్న చిన్న సమస్యలు మొదలు.. వారి స్థాయిని అనుసరించి నిర్వహించిన సాక్షి మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. కడప నగరంలోని జీఎంఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్ 'బి' క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్ ఆదివారం నిర్వహించారు. కేటగిరీ-1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-3లో 5, 6,7 తరగతుల విద్యార్థులు ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్నారు.

మ్యాథ్స్ అంటే ఎంతో ఇష్టం..



నాకు గణితం అంటే ఎంతో ఇష్టం. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. ఈ కాంపిటీషన్ ఎంతో బాగుంది. వచ్చే ఏడాది కూడా ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటా. – సి.ఎం.వి. బిందుశ్రీ, 5వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

మ్యాథ్స్ మేడ్ ఈజీ..



గణితం అంటే ఎంతో ఇష్టం. గణితాన్ని సులువుగా నేర్చుకునేందుకు ఎప్పుడూ సిద్ధమవుతుంటా. మ్యాథ్స్ కాంపిటీషన్స్ ఎక్కడ ఉన్నా పాల్గొంటా. గణితంపై ఉన్న ఆసక్తే నన్ను కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేసింది. – సి. తేజల్, 4వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

ఉత్సాహంగా స్పెల్'బీ'

- పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరు
- ఆంగ్లంపై ఆసక్తి పెరుగుతుందంటున్న విద్యార్థులు



రాయచోటి మురళి కోచింగ్ సెంటర్‌లో స్పెల్ బీలో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ : 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ 'బి'కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పెల్ 'బి'కాంపిటీషన్ క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్‌కు అపూర్వ స్పందన లభించింది. ఈ కాంపిటీషన్‌కు నాగార్జున మోడల్‌స్కూల్, జీఆర్‌టీ జీవీకే, జీఎంఆర్ విద్యాసంస్థల విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఆంగ్లంపై మక్కువ పెంచేలా, ఆసక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తున్న 'సాక్షి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన ఈ కాంపిటీషన్ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టేలా.. భాషపై పట్టు సాధించేలా కాంపిటీషన్ ఉందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. కాగా స్పెల్ 'బి' క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్‌లో కేటగిరీ-1లో 1,2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-2లో 3, 4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లీషు అంటే ఆసక్తి పెరిగింది..



స్పెల్ బి కాంపిటీషన్‌లో పాల్గొనడం వల్ల ఇంగ్లీషుపై ఆసక్తి పెరిగింది. ఇందుకోసం కొత్త పదాలను నేర్చుకున్నాను. ఈ స్పెల్లింగ్స్ నేర్చుకోవడం నాకు అకడమిక్‌గా కూడా ఉపయోగకరం. – ఎ. మోక్షిత, 6వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

కాంపిటీషన్ పరీక్షలకు ఉపయుక్తంగా ఉంటుందని..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్'బి'కాంపిటీషన్స్‌లో పాల్గొంటున్నా. కాంపిటేటివ్ పరీక్షలకు ఇది పునాదిగా భావిస్తున్నా. మెటీరియల్‌ను బాగా సాధన చేశా. ఫైనల్ వరకు వెళ్లాలన్నదే లక్ష్యం. -ఎస్. షాహిన్, 7వ తరగతి, జీఆర్‌టీ జీవీకే స్కూల్, కడప

పోటీతత్వం పెరుగుతుంది..



స్పెల్ 'బి'వంటి కాంపిటీటివ్ పరీక్షలకు హాజరుకావడం ద్వారా పోటీ తెలుస్తుంది. మనం ఏస్థాయిలో ఉన్నామో అర్థమవుతుంది. మన ప్రతిభను అంచనా వేసుకునేందుకు ఇటువంటి కాంపిటీషన్స్ ఉపయోగపడతాయి. – సి. భవిత, 5వ తరగతి, నాగార్జున మోడల్ స్కూల్, కడప

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు గ్రామానికి చెందిన కిట్టప్ప భార్య నాగసుబ్బమ్మ(48) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంటి వద్దే నిద్ర మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

ఓబులవారిపల్లె : మండలంలో పలుచోట్ల పేకాట, కోడిపందేల స్థావరాలపై ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో కలిసి దాడి చేసి 21 మందిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.25,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ షాక్‌తో 16 పందులు, ఒక కుక్క మృతి



మృతి చెందిన పందులు

రాయచోటి టౌన్ : విద్యుత్ షాక్‌తో 16 పందులు, ఒక కుక్క మృత్యువాత పడ్డాయి. బాధితుల కథనం మేరకు.. రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులోని ఎస్టీ కాలనీలో నివాసం ఉండే సప్పిడి పెద్ద పోలేరయ్య, శ్రీరాములు, సుంకయ్యలు పందులు మేపుకొని జీవనం సాగిస్తుంటారు. వీరి పందులు రోజులాగే మేత మేసి ఇంటికి వస్తున్న సమయంలో సమీపంలో రోడ్డుపై నిర్మించిన తూముల కింద కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అవి మృత్యువాత పడ్డాయి. రాయచోటి పశుసంవర్ధక సహాయక సంచాలకుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

జూదరుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

అట్లూరు : లంకమల్లేశ్వర అభయారణ్యం పరిధిలోని రామలింగేశ్వర ఆలయం దగ్గర ఆదివారం తెల్లవారు జామున మంగతాయి ఆడుతున్న 20 మంది జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.1,84,760లు నగదు, 20 సెల్‌ఫోన్లు, ఒక ఐషర్ ఆల్విన్ వాహనంతో పాటు 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పట్టుబడిన వారిలో బద్వేలు మండలం సిద్ధుగారిపల్లికి చెందిన ఇద్దరు నంద్యాల జిల్లా నంద్యాల పట్టణానికి చెందిన 18 మంది ఉన్నారన్నారు. ముందస్తు సమాచారంతో చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పుంజుకున్న టమాటా

- మార్కెట్లో కిలో టమాటా రూ.36 నుంచి రూ.40
- వారం రోజులుగా పెరుగుతున్న వైనం
- వర్షాలకు దెబ్బతిన్న పంట
- తగ్గిపోయిన దిగుబడి
- జిల్లాలో టమాటా ధరలు పెరగడానికి ఇదే కారణం



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ : జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.36 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. గత వారం రోజులుగా టమాటా ధరలు రోజురోజుకు పెరుగుతుండడం గమనార్హం. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు టమాటా పంట భారీగా దెబ్బతింది. దీంతో టమాటా పంట దిగుబడి రోజు రోజుకు తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రసుతం 1824 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మార్కెట్లకు వస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

19685 ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 19685 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. నెలరోజులుగా జిల్లాలో టమాటా పంట వర్షాల కారణంగా దిగుబడి తగ్గుతోంది. గత రెండు నెలలతో పోల్చితే ప్రస్తుతం మన జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో టమాటా పంట దిగుబడి రోజురోజుకు తగ్గిపోతోంది. గతంలో 28547 ఎకరాల్లో జిల్లా వ్యాప్తంగా టమాటా పంట దిగుబడి వచ్చింది. వర్షాలకు టమాటా తోటలు దెబ్బతినడంతో ప్రస్తుతం 19685 ఎకరాల్లో పంట దిగుబడి వస్తోంది. దీంతో రోజురోజుకు జిల్లాలోని టమాటా మండీల్లో టమాటాల స్టాకు తగ్గిపోతోంది.

మార్కెట్లో పుంజుకొన్న టమాటా ధరలు

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో టమాటా ధరలు పుంజుకొన్నాయి. వారం రోజుల క్రితం 25 కిలోల టమాటాల క్రేట్ ధర రూ.600 వరకు ధరలు పలికాయి. జిల్లాలో టమాటా పంట దిగుబడులు బాగా వస్తుండడంతో టమాటాలకు ధరలు అంతంత మాత్రంగానే ఉండేవి. వర్షాలకు టమాటా పంటలు దెబ్బతినడతో దిగుబడి తగ్గిపోయి ప్రస్తుతం వారం రోజులుగా మార్కెట్లో ధరలు రోజురోజుకు పుంజుకొంటున్నాయి. ప్రస్తుతం 25 కేజీల టమాటా క్రేట్ రూ.900 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. ప్రస్తుతం మొదటి రకం టమాటా కిలో రూ.40, రెండోరకం కిలో రూ.34 మూడో రకం రూ.27వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మార్కెట్లకు వస్తున్న రోజువారీ టమాటాల స్టాకు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో టమాటాలకు డిమాండ్ ఏర్పడి ధరల పెరుగుదలకు ఒక కారణంగా వ్యాపారులు చెప్పుకొంటున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంట

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో టమాటా పంట భారీగా దెబ్బతింది. వరుస తుఫాన్లు, వాతావరణంలో ఆకస్మిక మార్పుల కారణగా టమాటా పంటలకు చీడపీడలు ఎక్కువగా సోకాయి. ఆకుతెగులు, నల్లమచ్చలు, ఊజి, ఉల్లగడ్డరోగాలు ఎక్కువగా సోకడంతో జిల్లా వ్యాప్తంగా టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. ఎకరానికి 35 శాతం నుంచి 40 శాతం వరకు పంట దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 300 టమాటా క్రేట్లు నల్లమచ్చలు, ఊజిరోగంతో దెబ్బతిన్న టమాటాలు వచ్చాయి. దీంతో మార్కెట్లో వీటిని కొనేవారు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో రోజురోజుకు నాణ్యమైన టమాటాల స్టాకు తగ్గిపోవడంతో మిగిలిన టమాటాలకు మంచి ధరలు వచ్చాయి. వచ్చే నెలలో కొత్తగా టమాటా పంట దిగుబడులు ప్రారంభమయ్యే వరకు ధరలు రోజురోజుకు మరింత పెరిగే అవకాశముంది.

1824 మెట్రిక్ టన్నులకు తగ్గిన స్టాకు

జిల్లాలో నెలరోజుల క్రితం 3350 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మార్కెట్లకు వచ్చేది. వరుసగా కురిసిన వర్షాలకు వైరస్‌లు, రోగాలతో టమాటా తోటలు దెబ్బతిని ప్రస్తుతం 1824 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మన జిల్లాలోని టమాటా మార్కెట్లకు వస్తోంది. వారం రోజుల క్రితం వరకు జిల్లాలోని మార్కెట్లకు 2652 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు వచ్చింది. ప్రస్తుతం వరుస తుపాన్లతో టమాటా తోటలు దెబ్బతిని టమాటా మార్కెట్లకు 1824 మెట్రిక్ టన్నుల వరకు టమాటా స్టాకు వస్తుండడం గమనార్హం. జిల్లాలో నెలరోజులుగా అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా తోటలు దెబ్బతిని టామాటా దిగుబడి తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్లలో 35 శాతానికి పైగా టమాటాలు స్టాకు తగ్గిపోతోంది.

గత వారం రోజులుగా జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు ఇలా ఉన్నాయి

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25కేజీల క్రేట్)
18	2652	రూ.845
19	2456	రూ.910
20	2127	రూ.875
21	2098	రూ.930
22	1967	రూ.1000
23	1893	రూ.950
24	1824	రూ.1000

ధరలు ఆశాజనకంగా ఉన్నాయి



మార్కెట్లలో టమాటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వారం రోజులుగా రోజురోజుకు టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. వర్షాల కారణంగా టమాటా పంట దెబ్బతిని ఆశించినంత మేరకు స్టాకు మార్కెట్లకు రావడం లేదు. నల్లమచ్చలు, ఊజిరోగంతో దెబ్బతిన్న టమాటాలకు ధరలు లభించడం లేదు. నాణ్యమైన టమాటాలకు మాత్రమే మార్కెట్లో ధరలు ఉన్నాయి. వచ్చే నెలలో పంట దిగుబడి మరింత పెరిగే అవకాశముంది.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

కోటవారిపల్లె తాండాలో దాడులు

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె తాండాలో ఆదివారం మదనపల్లె,రాయచోటి ఎక్సైజ్ అధికారులు ఉమ్మడి దాడులు నిర్వహించినట్లు మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. తాండాకు చెందిన బి.కుమార్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజు ఎస్.ఐ జబీవుల్లా, ఈఎస్‌టీఎఫ్ రాయచోటి ఎక్సైజ్ సీఐ ఎల్లయ్య, ఎస్.ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నందలూరు: మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రామిశెట్టి సుబ్బరాయుడు (54) చెయ్యేరులోని గుంతలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈత కొడుతుండగా ఈ సంఘటన జరిగింది.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న కంటైనర్

కడప–చెన్నై జాతీయ రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాగారం సమీపంలో ఆదివారం సాయంత్రం గుండ్లూరు నుంచి సిమెంటు ఇటుక దిమ్మెలతో ఒంటిమిట్టకు వెళ్తున్న ట్రాక్టర్‌ను కడప నుంచి తిరుపతికి వెళ్తున్న కంటైనర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలల సమయాన్ని పెంచడం సరికాదు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంపుదల చేయడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

రసవత్తరంగా స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ పోటీలు



పోటీ పడుతున్న చిత్తూరు, వైఎస్సార్ జిల్లా జట్లు

మదనపల్లె సిటీ: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ అండర్–17 బాలికల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండో రోజు నెట్‌బాల్ పోటీలు లీగ్‌దశ నుంచి నాక్‌ఔట్‌కు చేరుకున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లు

విశాఖపట్నం, తూర్పుగోదావరి, వైఎస్సార్, చిత్తూరు, పశ్చిమగోదావరి, అనంతపురం, కృష్ణా, గుంటూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ పోటీలు రాష్ట్ర స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అబ్జర్వర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజ, నరేష్ బాబు, పీడీలు వెంకటేశ్వరప్రసాద్, భారతి, భద్రయ్య, లత, ఆసీఫ్, వరలక్ష్మి, పార్థ, ఖాదర్‌బాషా, రియాజ్, బాలాజీ పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య

రాయచోటి అర్బన్ : యాదవులు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా అభివృద్ధి పథంలో పయనించాలని అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. కార్తీక వనభోజనాలను పురస్కరించుకుని పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో యాదవుల సమైక్య సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవులకు కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తేజస్వి, ప్రఖ్య, సహస్ర, దుర్గా, దేవాన్ష్ యాదవ్‌ల భరత నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు పదిలం మహేష్ యాదవ్, జగన్నాథం యాదవ్, సేల్‌ట్యాక్స్ ఏఈఓ విజయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ రెడ్డెయ్య యాదవ్, అనంతపురం జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి



తనయుడి దాడిలో గాయపడిన తల్లి ఓబులమ్మ

పెద్దమండ్యం : ఓ తనయుడు వృద్ధురాలైన తన తల్లిపై రోకలిబండతో విచక్షణారహితంగా దాడి చేశాడు. తనయుడి దాడిలో తల్లి రెండు కాళ్లు విరిగిపోగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటన మండలంలోని సి.గొల్లపల్లెలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోడెం ఓబులమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు బోడెం ఓబులేసు వివాహితుడు. అయితే మనస్పర్థలు రావడంతో అతని భార్య పిల్లలను తీసుకెళ్లి ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఓబులేసు తన తల్లి ఓబులమ్మ (70) వద్దనే ఉంటున్నాడు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. మద్యం మత్తులో ఉన్న ఓబులేసు తల్లిపై రోకలిబండతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి బంధువులు ఎస్‌ఐ పి.వి.రమణకు ఫిర్యాదు చేశారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

కలకడ వాసి దుర్మరణం



కారులోనే మృతి చెందిన ప్రవీణ్‌చంద్ర చౌదరి

కలకడ: కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా కలకడ మండలం, గంగాపురం పంచాయతీ రంగప్పగారిపల్లెకు చెందిన పొత్తూరి రామచంద్ర నాయుడు కుమారుడు పొత్తూరి ప్రవీణ్ చంద్రచౌదరి (45) మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. పొత్తూరి ప్రవీణ్ చంద్ర చౌదరి బెంగళూరులోని ఎ.ఎస్.జడ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారి పిల్లల విద్యాభ్యాసం కోసం మదనపల్లెలో నివాసం ఉంటున్నారు. ఆదివారం మదనపల్లె నుంచి తన సొంత కారులో బెంగళూరుకు వెళుతుండగా బెంగళూరు నుంచి మదనపల్లె వైపు వస్తున్న శ్రీవెంకటేశ్వర ట్రావెల్స్ ప్రైవేటు బస్సు పొత్తూరి ప్రవీణ్ చంద్ర చౌదరి కారును చింతామణి వద్ద ఢీకొంది. కారు డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్ చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రవీణ్ చంద్ర చౌదరికి భార్య మైత్రి, కుమారుడు కార్తికేయ(12), కుమార్తె షాన్వి(5) ఉన్నారు. అతని మృతితో స్వగ్రామం గంగాపురం పంచాయతీలో విషాదం అలుముకుంది.



ప్రవీణ్‌చంద్ర చౌదరి (ఫైల్)

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం కల్లుపల్లె సర్కిల్‌కు చెందిన పద్మావతి (65) రోడ్డు దాటుతుండగా సాదిక్(15), అర్బాజ్(16) అనే యువకులు ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి ఆమెను ఢీకొన్నారు. ప్రమాదంలో పద్మావతి తీవ్రంగా గాయపడగా సాదిక్, అర్బాజ్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుడు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పద్మావతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన సోమశేఖర్ (38) కురబలకోట మండలం ముదివేడులో ఉన్న భార్య నాగేశ్వరి వద్దకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో కుమ్మరిపల్లె వద్ద తురకపల్లికి చెందిన ఫాహిర్ (20) వేగంగా ద్విచక్రవాహనంలో వచ్చి సోమశేఖర్‌ను ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధింత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పాత కక్షలతో వ్యక్తి హత్య



హత్యకు గురైన వీరనారాయణ యాదవ్

మైదుకూరు : తన కుటుంబానికి చెందిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కోపంతో మైదుకూరు మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన చింతకుంట వీరనారాయణ యాదవ్ (43) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన అతని దాయాది హత్య చేశాడు. మైదుకూరు అర్బన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం మృతుడు వీరనారాయణ యాదవ్, సుబ్బరాజు మరదలి చేయిపట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె భర్త బాలకృష్ణ బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఇంటిలో ఒంటరిగా ఉంటున్న తన మరదలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వీరనారాయణపై సుబ్బరాజు కక్ష పెంచుకున్నాడు. శనివారం రాత్రి వీరనారాయణ కొందరు మనుషులను పిలుచుకొని మైదుకూరు మున్సిపాలిటీలోని కృష్ణాపురం సమీపంలో భూమిరెడ్డి చిన్నయ్యగారి వెంకటయ్య అనే రైతు పొలంలోని ఉల్లికాడలను గొర్రెల కోసం తెచ్చుకునేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. అదే అదనుగా భావించి సుబ్బరాజు ఉల్లి పొలానికి సమీపంలో అరటి తోటలో కాపు కాసి ట్రాక్టర్లలో ఉల్లికాడలను లోడ్ చేస్తున్న వీరనారాయణ కాలి పిక్కపై గొడ్డలితో నరికాడు. అక్కడున్న వారు కేకలు వేయడంతో సుబ్బరాజు పారిపోయాడు. వారు చికిత్స కోసం వీరనారాయణను మైదుకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు చెప్పారు. అర్బన్ సీఐ సయ్యద్ హాసం సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నబీకోటలో చౌడేశ్వరి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న రాజశేఖర్ (29) అనే వ్యక్తి తన భార్య అనితతో గొడవపడుతుండేవాడు. వల్లూరు మండలం గోటూరుకు చెందిన రాజశేఖర్‌కు అనితకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి నాలుగు నెలల పాప సంతానంగా వుంది. ఈ క్రమంలో ఇంటిలో ఆదివారం ఉదయం భార్యాభర్తలిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొంత సేపటికి తన చంటిబిడ్డను తీసుకుని అనిత అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాజశేఖర్ ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజశేఖర్ మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. రాజశేఖర్ సోదరుడు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప తాలూకా ఎస్‌ఐ తాహీర్‌హుసేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం దుకాణాల వద్ద ఘర్షణ



గుర్రంకొండలో ఘర్షణలకు నిలయమైన మద్యం దుకాణలు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలోని మద్యం దుకాణాల వద్ద పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మద్యం దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. కాగా ఈ పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని తూముకుంట రోడ్‌లో రెండు మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటి పక్కనే పెద్ద ఎత్తున చిల్లర దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల్లో మద్యం ప్రియులు రాత్రింబవళ్లు మద్యం సేవిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఓ మద్యం దుకాణంలో పనిచేసే వ్యక్తికి మద్యం దుకాణం పక్కనే చిల్లర దుకాణం నిర్వహించే వారికి మధ్య వివాదం చెలరేగింది. ఈ వివాదం పెద్దదిగా మారి చిల్లర దుకాణం నిర్వహించే వారు మద్యం దుకాణంలో పనిచేసే వ్యక్తిని చితకబాదారు. దీంతో అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న పోలీసులు హుటాహుటిన మద్యం దుకాణాల వద్దకు చేరుకొని అందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మదనపల్లె జూనియర్ వెటర్నరీ అధికారికి జాతీయ అవార్డు



డాక్టర్ అనిల్‌కుమార్

మదనపల్లె : దేశంలో పశుసంవర్ధక పాడిపరిశ్రమ రంగంలో అత్యున్నత పురస్కారమైన జాతీయ గోపాలరత్న అవార్డుకు అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వేంపల్లె ప్రాంతీయ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి (జెవీఓ)డాక్టర్ వి.అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయి గోపాల్‌రత్న అవార్డుల్లో మూడో స్థానం పొందారు. దక్షిణాది రాష్ట్రాల్లో అవార్డుకు ఎంపికైన ఏకైక వ్యక్తి కావడం గమనార్హం. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో కృత్రిమ గర్భధారణ, పాల ఉత్పత్తి పెంపు, పాడి ఆవుల రెండు ఈతల మధ్య వ్యవధి కాలం, చూలు నిలిచిన శాతం, దూడలు ఈనిన శాతం తదితర అంశాలలో ప్రతిభ చూపిన ముగ్గురికి ఏటా దేశవ్యాప్తంగా ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది ఒడిస్సా రాష్ట్రం సుబర్నాపూర్‌కు చెందిన భాస్కర్‌ప్రదాన్, రాజస్థాన్ రాష్ట్రం హన్‌మాన్‌ఘర్‌కు చెందన రాజేంద్రకుమార్ మొదటి స్థానం పొందగా, రాజస్థాన్ హన్‌మాన్‌ఘర్‌కు చెందిన వీరేంద్రకుమార్ షైనీ రెండో స్థానం పొందారు. అనిల్‌కుమార్ దక్షిణాది రాష్ట్రాల నుంచి మూడవ స్థానం పొందారు. ఈనెల 26వతేదీ (మంగళవారం) ఢిల్లీలోని మానెక్‌షా సెంటర్‌లో జరిగే జాతీయ పాలదినోత్సవం (నేషనల్ మిల్క్ డే) సందర్భంగా కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అవార్డు అందుకోనున్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ విజేత జట్టుతో ఫిజికల్ డైరెక్టర్లు

రాయచోటి టౌన్ : అండర్ –14 జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపియ్యారు. ఆదివారం చిత్తూరు జిల్లా అరకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్ –14 సాఫ్ట్‌బాల్ ఆటల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేశు, భవంత్‌సాగర్, సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభి, రెడ్డివారిపల్లెకు చెందిన రాజేష్ ఉన్నారు. వీరితో పాటు మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అనూష, లక్ష్మీప్రసన్న, సన్నీ అనే ముగ్గురు బాలికలు కూడా ఎంపికయ్యారు. వీరు జనవరి నెలలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీలు జగదీశ్వరయ్య (మాసాపేట), వేణుమాధవ్ రాజు (వీరబల్లె), సుబ్రహ్మణం (కోడూరు) తెలిపారు. కాగా, రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు (బాలుర విభాగం) ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి విజేతగా నిలవడం పట్ల ఆ పాఠశాల పీడీ జగదీశ్వరయ్య హర్షం వ్యక్తం చేశారు.

అధికార పార్టీ సేవ కోసం పడిగాపులు



పై ఫొటోలో నేలపై కూర్చున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తున్నారు అనుకుంటే పొరబాటే. కాదు... ఏదైనా సాయం కోసం వచ్చారనుకుంటే పప్పులో కాలేసినటేఉట.. కేవలం టీడీపీ సీనియర్ వృద్ధనేత ఒకరు తన సొంత స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పారిశుద్ధ్య కార్మికులను అక్కడికి తరలించారు. రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా అన్న రీతిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సేవలను టీడీపీ నేతకు ధారాదత్తం చేశారు. ఉదయం 5గంటలకు మస్టర్ వేసుకొని పట్టణంలో చెత్తచెదారాలను ఎత్తివేసే కార్యక్రమం నిత్యం జరుగుతుంటుంది. ఆ పనికి వెళ్లనవసరంలేదు. స్కూల్ యాజమాన్యం నిర్వహించే క్లీన్ అండ్‌గ్రీన్ కార్యక్రమానికి వెళ్లండి అంటూ అధికారులు హుకుం జారీచేశారు. దీంతో పట్టణంలో తెల్లవారే సరికి రోడ్లపై కనిపించే పారిశుద్ధ్య కార్మికులు కనిపించలేదు.. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. ఆదివారం ఉదయం నుంచి మున్సిపల్ సిబ్బంది, అధికారులు అందరూ టీడీపీ నేత స్కూల్ సేవలో ఉండిపోయారు. దీంతో పట్టణవాసులకు 'చెత్త' సమస్య తప్పలేదు.

– రాజంపేట